క్లుప్తంగా

రక్షణ కల్పించండి సారూ..

సారంగాపూర్: సార్.. మమ్మల్ని పోలీసులు ఇబ్బంది పెడుతున్నారు.. మాకు రక్షణ కల్పించండంటూ మండలంలోని పలు గ్రామాలకు చెందిన యువకులు, వారి తల్లిదండ్రులు శుక్రవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి మొర పెట్టుకున్నారు. సారంగాపూర్ పోలీస్‌స్టేషన్ నుంచి గంజాయి మాయం కావడంపై పోలీసుల విచారణ కొనసాగుతోంది. ఇందులో భాగంగా సారంగాపూర్, బట్టపల్లి, పోతారం, లక్ష్మీదేవిపల్లి, పెంబట్ల గ్రామాలతోపాటు జగిత్యాల పట్టణానికి చెందిన పలువురు యువకులను పోలీసులు స్టేషన్‌కు తీసుకొచ్చి విచారిస్తున్నారు. గతంలో గంజాయి అమ్మిన వారితోపాటు అనుమానితులను విచారణ చేస్తున్నారు. గంజాయి మాయం కావడంపై విచారణ పేరుతో పోలీస్‌స్టేషన్‌కు తమ పిల్లలను పిలుస్తున్నారని, వారి వెంట తమ ఆధార్ కార్డులు వెంట తెచ్చుకోవాలని పేర్కొంటున్నారని యువకుల తల్లిదండ్రులు ఎమ్మెల్సీ ముందు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్సీ పోలీసులతో మాట్లాడినట్లు తెలిపారు. గంజాయి మాయంపై విచారణ జరపడం తప్పు కాదని, అసలు నిందితులను పట్టుకోవాలని, ఇదే సమయంలో అమాయకులను ఇబ్బంది పెట్టొద్దని, పోలీస్‌స్టేషన్‌కు యువకులను పదేపదే పిలవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారని ఎమ్మెల్సీ పోలీసులతో పేర్కొన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులతో కూడా మాట్లాడుతానని ఎమ్మెల్సీ వారికి హామీ ఇచ్చారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ



యామపూర్‌లో ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తున్న ఏఎన్ఎం సుప్రియ

ఇబ్రహీంపట్నం: యామపూర్ గ్రామంలో శుక్రవారం ఉపాధిహామీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఏఎన్ఎం సుప్రియ, పంచాయతీ కార్యదర్శి దివాకర్ పంపిణీ చేశారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున కూలీలు ఉదయమే పనులకు వెళ్లి రావాలని, కుంటలు, చెరువుల్లో నీరు తాగొద్దని, స్వచ్ఛమైన నీటిని బాగా తాగాలని సూచించారు. ఓఆర్ఎస్‌ను నీళ్లలో కలుపుకొని తాగితే ఎండ దెబ్బ తగలకుండా ఉంటుందన్నారు. అనంతరం అంగన్‌వాడీ, ఐకేపీ, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ ప్రభాకర్ పాల్గొన్నారు.


రైతుల్లో ఆనందం నింపడమే ప్రభుత్వ లక్ష్యం



పెగ్గెర్ల శివారులో వరి పరిశీలిస్తున్న నాయకులు

కథలాపూర్: రైతులను సాగుకు ప్రోత్సహించి వారిలో ఆనందం నింపడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ సీనియర్ నేత చెదలు సత్యనారాయణ అన్నారు. శుక్రవారం పెగ్గెర్లలో రైతులతో కలిసి వరి పొలాలను పరిశీలించారు. విప్ ఆది శ్రీనివాస్ చొరవతో వరద కాలువ ద్వారా నీళ్లు వదిలారని, దీంతో పెగ్గెర్లలో పంటలు సమృద్ధిగా ఎదిగాయన్నారు. ఎస్సారెస్పీలో సరిగా నీళ్లు లేకున్నా క్రాస్ రెగ్యులేటర్ వద్ద నిల్వ ఉన్న నీటిని కథలాపూర్, మేడిపెల్లి మండలాలకు వదలాలని ఆది శ్రీనివాస్ సంబంధిత అధికారులకు సూచించారన్నారు. నాయకులు పొట్టెపు గంగారాం, కారపు గంగాధర్, మార్గం శ్రీనివాస్, అంజయ్య, లవకుమార్, బాలు, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

'అంగన్‌వాడీ'లో ప్రాథమిక విద్యాదినోత్సవం



పాల్గొన్న చిన్నారులు, టీచర్, తల్లిదండ్రులు

కోరుట్లరూరల్: ఐయిలాపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పూర్వ ప్రాథమిక విద్యాదినోత్సవం నిర్వహించారు. ప్రీస్కూల్ కార్యక్రమాలను పిల్లలతో చేయించారు. పిల్లల మనోవికాసానికి పుస్తకాలను పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రాజమణి, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బందికి సన్మానం



పెగడపల్లి: లింగాపూర్ గ్రామానికి కరీంనగర్ 2వ డిపో నుంచి బస్సు సౌకర్యం కల్పించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా గ్రామస్తులు ఆర్టీసీ సిబ్బందిని అభినందించారు. బస్సు కండక్టర్, డ్రైవర్ ఎం.రాజయ్య, కేఆర్ మల్లును శుక్రవారం సన్మానించి ఆర్టీసీ సేవలను కొనియాడారు. శంకరయ్య, భాస్కర్, డిల్లీశ్వర్ రావు, తిరుపతి, సునీల్, భూమయ్య, హన్మాన్ భక్తులు పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్ రామ్‌కు నివాళి



ధర్మపురిలో నివాళి అర్పిస్తున్న విప్ లక్ష్మణ్, నాయకులు



కోరుట్ల: జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాలటౌన్/కోరుట్ల/ధర్మపురి/జగిత్యాలఅగ్రికల్చర్/వెల్గటూర్/మల్యాల: జిల్లావ్యాప్తంగా శుక్రవారం బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రావణి బాబూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలో మాదిగ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి స్వీట్లను పంపిణీ చేశారు. సభ్యులు నల్లూరి సాగర్, తిమ్మణి రమేశ్, కొత్తూరి నర్సయ్య, గడసంద రమేశ్, బంగారి దాస్, తిమ్మణి అరుణ్, కనక దినేశ్, తిమ్మణి అక్షయ్, కనక దిలీప్, తిమ్మణి మారుతి, తిమ్మణి రాహుల్, శ్రీవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పెగడపల్లి: మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో జగ్జీవన్ రామ్ చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. నాయకులు మాట్లాడుతూ.. ఆయన సేవలను కొనియాడారు. మండల అధ్యక్షుడు రాములుగౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్, మల్లారెడ్డి, రవినాయక్, మహేందర్, భాస్కర్, రాజు, రాజేందర్, దుర్గప్రసాద్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: కాంగ్రెస్ కార్యాలయంలో ధర్మపురి దేవస్థానం కమిటీ మాజీ అధ్యక్షుడు జువ్వాడి కృష్ణారావు, పలువురు నాయకులు జగ్జీవన్‌రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మున్సిపల్, బీసీ సంఘం, బార్ అసోసియేషన్ కార్యాలయాల్లో నిర్వహించారు.



జగిత్యాలఅగ్రికల్చర్: పొలాస వ్యవసాయ పరిశోధన స్థానంలో నివాళి అర్పిస్తున్న శాస్త్రవేత్తలు



ఇబ్రహీంపట్నంలో జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసిన యువకులు



జగిత్యాలటౌన్: నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు



మెట్‌పల్లి: నివాళి అర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు



వెల్గటూర్‌లో నివాళి అర్పిస్తున్న నాయకులు



పెగడపల్లిలో నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న సీఐ రవి

మల్యాల: ప్రజలు సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన పెంచుకోవాలని మల్యాల సీఐ నీలం రవి అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నూకపల్లి గ్రామంలో శుక్రవారం సైబర్ నేరాల నియంత్రణపై ప్రజలకు పోలీసు కళాబృందాలు అవగాహన కల్పించాయి. ప్రజలు గుర్తుతెలియని వ్యక్తులకు ఓటీపీ చెప్పొద్దని సూచించారు. ఎస్సైలు అబ్దుల్ రహీం, కుమారస్వామి పాల్గొన్నారు.

ఘనంగా వీరభద్రస్వామి జాతర



స్వామివారి కల్యాణంలో భక్తులు

కథలాపూర్: పెగ్గెర్ల గ్రామంలో శుక్రవారం వీరభద్రస్వామి జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణం నిర్వహించి యజ్ఞం జరిపారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాలకు హాజరైన భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మల్యాల: తక్కళ్లపల్లి జిల్లాపరిషత్ పాఠశాల పూర్వ విద్యార్థులు శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. 2005–2006 విద్యాసంవత్సరంలో పదోతరగతి చదువుకున్న విద్యార్థులు ముత్యంపేట గ్రామంలోని దిగువ కొండగట్టులో నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో కలుసుకున్నారు. పాఠశాల జ్ఞాపకాలను స్మరించుకున్నారు.

అలరించిన వీడ్కోలు వేడుకలు



విద్యార్థుల నృత్య ప్రదర్శన

కోరుట్ల: పట్టణంలోని శ్రీసరస్వతి శిశుమందిర్‌లో పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థుల ఆటాపాటలు అలరించాయి. ప్రబంధకారిణి అధ్యక్షుడు డాక్టర్ వేముల రవికిరణ్, వనతడుపుల రవికుమార్, నీలి శ్రీనివాస్, కార్యదర్శి వనపర్తి చంద్రమోహన్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రాయికల్: అల్లీపూర్ పరిధిలోని అల్లీపూర్, కిష్టంపేట, సింగరావుపేట, శ్రీరాంనగర్, కుర్మపెల్లి గ్రామాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ అర్జున్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యార్థులకు సీవీ రామన్ యంగ్ జీనియస్ అవార్డులు



అవార్డు అందుకుంటున్న విద్యార్థి

కోరుట్ల: పట్టణానికి చెందిన కేపీఎస్ స్కూల్ విద్యార్థులు సర్ సీవీ రామన్ యంగ్ జీనియస్ అవార్డులు అందుకున్నారు. సచిన్ ఇండియా ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఈ అవార్డులను ఆస్కార్ అవార్డు గ్రహీత, తెలుగు సినీ గేయ రచయిత చంద్రబోస్ అందజేశారు. సీవీ రామన్ ఒలంపియాడ్ ఎగ్జామ్‌లో రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంక్ సాధించిన సుతారి శాన్విత, జిల్లాస్థాయి ఫస్ట్ ర్యాంక్ సాధించిన నేమూరి నిత్యశ్రీ, అరిసె విశ్వక్, జిల్లా స్థాయి ద్వితీయ ర్యాంక్ సాధించిన జేమ్ శ్రీనిధికి చంద్రబోస్ అవార్డులు, నగదు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ప్రిన్సిపాల్ గుజ్జేటి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి



ధర్మపురిలో ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న కమిషనర్

ధర్మపురి: భూగర్భ జలాల పెరుగుదల కోసం ప్రతి ఇంట్లో ఒక ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి సూచించారు. ధర్మపురి పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఇంకుడు గుంతను శుక్రవారం పరిశీలించారు. వర్షం నీటిని వృథాగా పోనీయకుండా ఎక్కడికక్కడే గుంతలను ఏర్పాటు చేసుకుంటే నీరు వృథా కాదని, ముఖ్యంగా భూగర్భ జలాలు పెరుగుతాయని తెలిపారు.

నృత్య కళాకారుడికి సన్మానం



మల్లాపూర్: మండల కేంద్రంలో శుక్రవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శ్రీనటరాజ నృత్య కళానిలయం వ్యవస్థాపకుడు, ప్రముఖ నృత్య కళాకారుడు భూపతిగౌడ్‌ను లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కనుక సంజీవ్, రీజియన్ కార్యదర్శి రుద్ర రాంప్రసాద్ అఖిలపక్ష నాయకులతో కలిసి ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ.. మెట్‌పల్లి డివిజన్‌లో భూపతిగౌడ్ కళాకారులను ప్రోత్సహించేందుకు కళానిలయాన్ని స్థాపించాడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, అఖిలపక్ష నాయకులు ముద్దం సత్యనారాయణగౌడ్, మరిపెల్లి మల్లయ్య, ముద్దం చంద్రప్రకాష్‌గౌడ్, కోటగిరి ఆనంద్‌గౌడ్, గోట్టిపడత రాజు తదితరులు పాల్గొన్నారు.

జీవో రద్దు చేయాలి

కోరుట్ల: రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ బెనిఫిట్స్‌పై తెచ్చిన జీవోను వెంటనే రద్దు చేయాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సాయిశ్వరి అన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు రూ.1 లక్ష, ఆయాలకు రూ.50వేలు రిటైర్‌మెంట్ బెనిఫిట్ ఇవ్వాలని తెచ్చిన జీవోను రద్దు చేసి టీచర్లకు రూ.10లక్షలు, ఆయాలకు రూ.5 లక్షలు ఇవ్వాలని తెలిపారు. రిటైర్‌మెంట్ తర్వాత ప్రతినెలా రూ.5వేలు పెన్షన్ ఇచ్చేలా జీవో జారీ చేయాలని డిమాండ్ చేశారు.

చలివేంద్రం ప్రారంభం

మెట్‌పల్లి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో చలివేంద్రాన్ని శుక్రవారం కమిషనర్ మోహన్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు అవసరమైన చోట చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు సూచించారన్నారు. ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, సిబ్బంది ఉన్నారు.



ధర్మపురిలో ఇఫ్తార్ విందులో పాల్గొన్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



మెట్‌పల్లిరూరల్: పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, ముస్లిం పెద్దలు

ఇఫ్తార్ విందు

ధర్మపురి: రంజాన్ మాసం పురస్కరించుకొని ముస్లింలకు హిందువులు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ధర్మపురి పట్టణంలో శుక్రవారం సాయంత్రం కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు వేముల రాజేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ముస్లింలతోపాటు ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరలున్నారు.

మెట్‌పల్లిరూరల్: పవిత్ర రంజాన్ పండుగ సర్వ మానవ సౌభ్రాతృత్వానికి ప్రతీక అని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కృష్ణారావు అన్నారు. శుక్రవారం వేంపేట గ్రామంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు, ముస్లిం మత పెద్దలు తదితరులున్నారు.

చెరువుల మరమ్మతుకు తరుణమిదే..



గంభీర్‌పూర్ శివారులో కోతకు గురైన కొచ్చెరువు కట్ట



తాండ్య్రాల శివారులో మరమ్మతు చేయాల్సిన ఊర చెరువు ఇదే..

- కథలాపూర్ మండలంలో మూడు ప్రధాన చెరువులకు గండ్లు
- వర్షాలు కురిస్తే మరమ్మతు కష్టమంటున్న రైతులు

కథలాపూర్: గ్రామాలకు సాగు, తాగునీరందించి భూగర్భజలాలు పెంచడంలో ప్రధానమైన చెరువులకు గతేడాది కురిసిన వర్షాలతో గండ్లు పడి నీరంతా వృథాగా పోయాయి. వానలతో నష్టపోయిన చెరువులను అధికారులు, ప్రజాప్రతినిధులు అప్పట్లో పరిశీలించారు. మరమ్మతుల విషయంలో జాప్యం జరగడంతో ఆయకట్టు రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వేసవి కాలంలో చెరువుల మత్తడి, తూములకు మరమ్మతులు చేస్తే.. వర్షాకాలంలో చెరువుల్లో నీళ్లు చేరుతాయని రైతులంటున్నారు. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.

మరమ్మతు చేయాల్సిన ప్రధాన చెరువులివే..

గంభీర్‌పూర్ గ్రామానికి ప్రధానమైన కొచ్చెరువు కట్ట గతేడాది జూలై నెలలో కురిసిన భారీ వర్షాలకు కోతకు గురై మత్తడి ధ్వంసమైంది. తాండ్య్రాల గ్రామ శివారులోని ఊర చెరువు మత్తడి పగుళ్లు బారి నీళ్లు వృథాగా పోయాయి. బొమ్మెన ప్రాజెక్టు మత్తడి, తూముకు వర్షాల వల్ల నష్టం జరిగింది. వర్షాలతో కోతకు గురైన చెరువులను అప్పట్లో ప్రజాప్రతినిధులు, నీటిపారుదల శాఖ అధికారులు పరిశీలించారు. మరమ్మతులు చేయిస్తామని చెప్పి ఇప్పటి వరకు పురోగతి లేకపోవడంతో రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు మరమ్మతులు చేయిస్తే వానాకాలంలో నీళ్లు నిల్వ ఉండి ఏడాది కాలం పాటు సాగు, తాగునీటి సమస్యలు తీరుతాయని ఆయా గ్రామాల ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

త్వరగా మరమ్మతు చేయాలి



గంభీర్‌పూర్ గ్రామానికి సాగు, తాగునీటికి ఆధారం కొచ్చెరువు. కొచ్చెరువులో నీళ్లుంటే గ్రామంలోని బోరు బావుల్లో నీళ్లుంటాయి. అలాంటి చెరువును త్వరగా మరమ్మతులు చేయించాలి. కొచ్చెరువులో నీళ్లు లేక ఈసారి పంటలకు సరిగా నీళ్లందలె. ప్రభుత్వం స్పందించాలి.

– మొగుళ్ల మల్లేశం, రైతు, గంభీర్‌పూర్

ముందుచూపుతో వ్యవహరించాలి



గ్రామాలకు ప్రధానమైన చెరువుల మరమ్మతుల విషయంలో ప్రభుత్వం ముందుచూపుతో వ్యవహరించాలి. తాండ్య్రాల ఊర చెరువు మత్తడి ధ్వంసం కావడంతో నీళ్లు బయటకు వెళ్లి చెరువు ఎండిపోయింది. తాండ్య్రాల, పోసానిపేట గ్రామాల్లో పలువురి రైతుల పంటలు ఎండిపోయాయి. మత్తడికి అప్పట్లో మరమ్మతులు చేయిస్తే బాగుండేది. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు చొరవ చూపి వేసవి కాలంలోనే మరమ్మతులు చేయిస్తే రైతులకు ప్రయోజనం.

– గండ్ర కిరణ్‌రావు, వైస్ ఎంపీపీ, తాండ్య్రాల

నంబర్ ప్లేట్లు లేని వాహనాలు సీజ్

మెట్‌పల్లిరూరల్: నంబర్ ప్లేట్లు లేని వాహనాలపై పోలీసులు కొరడా ఝులిపించారు. వెల్లుల శివారులో మెట్‌పల్లి పోలీసులు శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. 15 ద్విచక్ర వాహనాలకు నంబర్ ప్లేట్లు లేవని గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు.

గుండెపోటుతో వలస కార్మికుడు మృతి



ఇటుక బట్టిపై నిద్రలో మరణించిన కార్మికుడు

మేడిపల్లి: ఇటుక బట్టిలో పని చేసే ఓ వలస కార్మికుడు గుండెపోటుతో నిద్రలోనే మరణించాడు. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన సంపత్‌రౌత్ అనే వలస కార్మికుడు మేడిపల్లి శివారులో గల వీఎస్ఆర్ ఇటుకల బట్టిలో నాలుగు నెలల నుంచి పని చేస్తున్నాడు. గురువారం రాత్రి భోజనం చేసిన తర్వాత ఇటుక బట్టిపై పడుకున్నాడని, ఉదయం లేపితే లేవలేదని స్థానికులు తెలిపారు. పోలీసులకు సమాచారమిచ్చారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్యాంరాజ్ తెలిపారు.

కొమొరెడ్డి రామ్‌లుకు నివాళి

మెట్‌పల్లి: మాజీ ఎమ్మెల్యే కొమొరెడ్డి రామ్‌లు వర్ధంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. జువ్వాడి భవనంలో నాయకులు కృష్ణారావు, జెట్టి లింగం తదితరులు రామ్‌లు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రామ్‌లు నివాసంలో ఆయన అనుచరులు నివాళి అర్పించారు.





పక్షుల కోసం నీళ్ల కుండలు ఏర్పాటు

కోరుట్ల: పక్షులు నీళ్లు తాగేందుకు పట్టణంలోని వివిధ ప్రదేశాల్లో మున్సిపల్ ఆధ్వర్యంలో నీళ్ల కుండలు, తొట్టిలను శుక్రవారం ఏర్పాటు చేశారు. కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ ఆదేశాలతో పట్టణంలో రోడ్డు పక్కన, రోడ్డు డివైడర్ల మధ్యన పక్షులు నీళ్లు తాగేందుకు కుండలు ఏర్పాటు చేశామని మున్సిపల్ అధికారులు తెలిపారు.

మామిడి రైతులను ఆదుకోవాలి

రాయికల్: జిల్లాలోని మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా రైతు ఐక్య వేదిక నాయకుడు రాంరెడ్డి కోరారు. శుక్రవారం విలేకర్లతో మట్లాడుతూ.. 4 సంవత్సరాల నుంచి మామిడి రైతులు వాతావరణ పరిస్థితి సరిగా లేక నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.